21022025-MAI-04_Layout 1 2/21/2025 2:46 AM Page 1

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కేసీఆర్ సమరశంఖం

చెరిపేయాలనుకుంటే *చరిత్ర చెరిగిపోదు. చరిత్రనే నిర్మించిన మూర్తిని తెరమరుగు చేయాలనుకుంటే అది పగటి కలే అవుతుంది. బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీకి ప్రతిరూపమైన కేసీఆర్ ఈ గడ్డకు పంచప్రాణాలు. అరచేతిలో స్వర్గం చూపిన టక్కుటమార మూక బేకార్ పాలనలో రైతులు, మహిళలు, వృద్ధులు ఇలా అన్నివర్గాలు అరిగోస అనుభవిస్తున్నాయి. తెలంగాణ మట్టిలో మొలకెత్తిన పార్టీ.. ఇక్కడి చరిత్రతో పెనవేసుకొని ఎదిగిన పార్టీగా బీఆర్ఎస్ స్థానం ప్రత్యేకమైనది. అందుకే ఇది దీక్షా సమయం, పరీక్షా సమయం అంటూ పార్టీని కేసీఆర్ సన్నద్ధం చేశారు. 'సింగంబాకటితో' అన్నట్టుగా కేసీఆర్ మరోమారు ఆయుధాలు సంధించి, సమరశంఖం పూరించారు. ఢిల్లీ పార్టీ ముంచితే అండగా నిలవాల్సింది గల్లీ పార్టీయే కదా. నాడు, నేడు, ఏనాడైనా తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష అని చాటిచెప్పడం పార్టీ శ్రేణుల్లో కొండంత ధైర్యం నింపింది. అవరోధాలు తాత్కాలికం, బీఆర్ఎస్ శాశ్వతమంటూ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ కర్తవ్యబోధ చేశారు. కదనానికి సమాయత్తం చేశారు.*

తెలంగాణ అస్తిత్వం కోసం జరిపిన అవిశ్రాంత పోరులో కేసీఆర్ ఎన్ని ఎదురు దెబ్బలను తట్టుకొని నిలవలేదు? ఎన్ని ఆటంకాలను విజయానికి సోపానాలుగా మలచుకుని జైత్రయాత్ర చేయలేదు? తన వ్యూహ చతురతతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ మునుముందుకు సాగడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. అన్నిటినీ ఎదురొడ్డి నిలిచి గమ్యాన్ని ముద్దాడిన పార్టీ బీఆర్ఎస్. చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్ తన మేధోమథనంతో ఈ గడ్డను విజయపథంలో నిలిపారు. కానీ ఓటరు మోసపోయి గోసపడుతున్నడు. అదాటున మరుగుజ్జుల ఆధిపత్యంలోకి వెళ్లిన తెలంగాణ 14 నెలలుగా ఆగమైపోతున్నది. తెలంగాణ సోయిలేని అక్రమార్కుల శిశుపాల నేరాల చిట్టా చివరి ఘట్టానికి చేరుకుంటున్నది. 'మళ్లీ మొలవనివ్వను.. తరిమేస్తా' అనే రాజకీయ తెంపరితనపు కూతలు అంతకంతకూ పేలవంగా ధ్వనిస్తున్నాయి.

తెలంగాణను గుండెల్లో పొదువుకునే కేసీఆర్ చూస్తూ ఊరుకుంటారా? ఆయన ఆయుధాలు సవరించుకుంటుంటే అవతలి పక్షంలోనూ 'వచ్చెడివాడు ఫల్గుణుడన్న' తత్తరపాటు ధ్వనిస్తున్నది. మోసాల వాసాలపై వెలిసిన వంద కల్లల అధికార సౌధం ఊగిసలాడుతున్నది. పదేండ్ల పాలన వెలుగులు ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నాయి. ఏడాది పైచిలుకు పరిపాలనా ప్రహసనం ఎదురుగానే కనిపిస్తున్నది. ఇత్తేసి పొత్తుగూడి, ఆపై దశాబ్దాల పాటు అణచివేత, దోపిడీకి గురిచేసిన ద్రోహులు... మారిన పరిస్థితుల్లో రెచ్చిపోయి మరోసారి బుసలు కొడుతున్నారు. ముసుగులు వేసుకొని దూరిపోవాలని చూస్తున్నారు. అందుకే తెలంగాణ అసాధారణ పోరాట చైతన్యం ఆవిరి కానివ్వొద్దని కేసీఆర్ పిలుపునిచ్చారు. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఫిరాయింపుల మొరాయింపు పైనా చెణుకులు వేశారు. అరచేతిలో స్వర్గం చూపి అడ్డగోలుగా ముంచినోళ్ల దుంప తెంచాలని ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారు. ఓటుపోటుతోనే గుణపాఠం చెప్పాలని ఎదురు చూస్తున్నారు. అందుకే ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్ బంపర్ మెజారిటీతో గెలవడం ఖాయమని కేసీఆర్ చెప్పడం పార్టీలో కొండంత బలం నింపింది. కేసీఆర్ పిలుపే ఓ ప్రభంజనం. జంగ్‌సైరన్ మోగింది. ఇక సమరమే.

ఎవరి అడుగుజాడల్లో ఏమున్నది!

శ్రీశైల్ రెడ్డి పంజుగుల
90309 97371

"బంగారు పంట మనది..
మిన్నేరు గంగ మనది...
ఎలుగెత్తి చాటుదాముర..
ఇంట్లో ఈగల్ని తోలుదాముర..!"

102.8 ఎఫ్ఎం జనరంజనిలో ఆత్రేయ 'ఆకలి రాజ్యం' సినిమా పాట వస్తున్నది ఈ వ్యాసం రాస్తూండగా. చాలా అంశాల్లో మన దేశపు పరిస్థితి ఆ సినిమా వచ్చిన 1980ల కంటే పెద్దగా బాగు పడలేదు. ప్రపంచంలో ఐదో ఆర్థికశక్తి మనం... అయినా మన సంపద, మన కీర్తి అన్నీ దేశంలో రెండో మూడో శాతం పెద్ద కుటుంబాల చేతిలో ఉన్నయి. జన సామాన్యం గోస 78 ఏండ్ల స్వాతంత్ర్యం తీర్చలేకపోతున్నది.

తెలంగాణలో ఈ చిత్రం మెరుగుపడింది పదేండ్ల కేసీఆర్ పాలనలోనే. అన్ని అభివృద్ధి సూచీలలో, సంక్షేమంలో దేశంలోనే మొదటి స్థానం. ప్రత్యర్థి పార్టీ అయినప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రగతి నివేదికలు బయటపెడుతూ తెలంగాణకు ఎన్నో అవార్డులూ, రివార్డులూ ఇచ్చింది, ప్రతి ఏటా అలుపు లేకుండా! మొన్ననే రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన్రు- 2014-24 మధ్యకాలంలో తెలంగాణ జీడీపీ 15 లక్షల కోట్లు దాటిందని. కేసీఆర్ పాలనలో 3.25 లక్షల పెట్టుబడులు; ఐటీ ఎగుమతుల్లో 31 శాతం వాటా; జీఎస్డీపీ, తలసరి ఆదాయం, సాగు విస్తీర్ణం అన్నిట్లోనూ తెలంగాణ రికార్డ్ అంటూ ఎంఎస్ఎంఈ-ఈపీసీ నిన్ననే కితాబిచ్చింది.

ఊసర క్షేత్రాలు సస్యశ్యామలమై, సంపదాభిరామమైన చరిత్ర మన కండ్ల ముందే ఉన్నది. రైతుబంధు సవ్యంగా, సకాలంలో ఇచ్చి, పండిన పంటను లాభసాటి ధరకు కొంటే... రైతులు అప్పులపాలు కారు; రుణాల ఊబిలో కూరుకుపోరు; సోనియమ్మ పుట్టిన రోజు గిఫ్ట్ కోసం ఏండ్ల తరబడి ఎదురుచూసే దౌర్భాగ్యంలోకి రైతులు తోసివేయబడ్డరు! పదేండ్ల బంగారు పాలనలో రైతాంగం పొందిన ఊరట గురించి నేను రాసే కంటే, ఇప్పుడు అది కోల్పోయిన రైతాంగం పెడుతున్న శాపనార్థాలు, కొండొకచో బూతులు సవివరంగా చెప్తాయి!

రేవంత్ మాత్రం ప్రగతి గణాంకాలు దాస్తున్నరు, మరెన్నో విజయగాథలు మాయం చేస్తున్నరు, తెలంగాణ సాధకులుగా ఎవరెవరినో నిలపాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నరు. మొత్తంగా, అన్నిరంగాల్లో తెలంగాణను విఫల రాష్ట్రంగా నిలిపిన్రు! ఆయన పద్నాలుగు నెలల పాలనపై రాష్ట్రమంతా నిరసనలు పెల్లుబుకుతున్నయి. ప్రతీ వర్గమూ ఆందోళనలో ఉన్నరు. సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కని వారు లేరు! లగచర్ల నుంచి నిర్మల్ దాకా కడుపు మండిన రైతాంగం అధికారులను తరిమికొడుతున్నది. ప్రజల నిరసనలు అణచివేసే కొత్త కోరలను ప్రభుత్వంలోని నాయకులు, అధికారులు తొడుక్కుంటున్నరు. దీపం ఉండగానే చక్కబెట్టుకునే పనిలో రేవంత్, ఆయన కుటుంబం బిజీగా ఉన్నది. భూములూ, డబ్బూ పోగేసుకుంటున్నరు, అధిష్ఠానానికింత పడేస్తున్నరు. సీఎం దగ్గర ఉన్న పోర్ట్ ఫోలియోల శాఖలన్నీ పడకేసినయి. అవి శాంతిభద్రతలు కావచ్చు, నానాటికీ తీసికట్టవుతున్న విద్య కావచ్చు, దారుణంగా విఫలమైన శాంతిభద్రతలు కావచ్చు, కటిక నేల మీద పడుకోబెట్టి లేదా చేతులకు బేడీలు వేసి అందిస్తున్న వైద్యం కావచ్చు! సాధారణంగా తండ్రి వంటి పాలకుడిని అన్నమో రామచంద్రా అని అర్థిస్తరు అన్నార్తులు. 'మీరు పెట్టే అన్నం వద్దు మహాప్రభో' అంటున్నరు హాస్టల్ విద్యార్థులు. రేవంత్ రెడ్డి ద్వేషం నికార్సైనది కానీ, ఆయన ఒలకబోసే ప్రేమ విషతుల్యం!

సరస్వతి కవుల అనే సామాజిక కార్యకర్త రాసిన్రు మొన్నొక వ్యాసంలో నా సలహా పాటించండి, నేను ఉపయోగించడం లేదనే చమత్కారమైన సామెత కాంగ్రెస్ పార్టీకి బాగా వర్తిస్తుంది. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను తెలంగాణలో ఉల్లంఘిస్తున్నది. బాపూజీ, బాబాసాహెబ్ ఆదర్శాలకు విరుద్ధంగా పాలన చేస్తున్నది. ఇతర రాష్ట్రాల్లో మాత్రం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ఉద్యమాలు నిర్వహిస్తున్నది!

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహా ఎంతో మంది కేసీఆర్ పాలనను బహిరంగంగానే పొగుడుతున్నరు. 'కేసీఆర్ ఫొటో పెట్టుకుంటే తప్పు ఏంటి?' అని అధికార శిబిరంలోని ఎమ్మెల్యేలు ధిక్కార స్వరం వినిపిస్తున్నరు. 'వరుస తప్పిదాలతో అణువణువునా, అడుగడుగునా రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను గురుతుతెస్తున్నడు' అని ఆంధ్ర జ్యోతి రాధాకృష్ణ నిట్టూరుస్తున్నరు. మంత్రులకు సైతం సీఎం పేరు గుర్తురావడం లేదు. పార్టీపై, పాలనపై, రాష్ట్రంపై ఏదైనా సమ్మిద్ర వేస్తే కదా గుర్తు రావడానికి?

మిత్రులారా! రేవంత్‌రెడ్డి అడుగుజాడలవి.
ఆయన చూపించే దిగుడు ఊబి అది.

కాబట్టే, మొన్న ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలోనూ, నిన్న తెలంగాణ భవన్ విస్తృత స్థాయి సమావేశంలోనూ కేసీఆర్‌కు ఇసుకేస్తే రాలనంత జనాభిమానం, హృదయామోదం. రెండు గంటల తన దిశా-నిర్దేశపు ప్రసంగంలో కేసీఆర్ చెప్పిన అంశాల సారం ఒక్కటే లైన్ మనం అధికారంలోకి వస్తం, అది కాదు విషయం. తెలంగాణను మళ్లా ఎట్లా నిలబెట్టాలె అన్నదే. ఇది ఉత్తి మాట కాదు. ఒక మహా స్వాప్నికుడతను. ప్రజల కోసం రక్తంతో రాసుకున్న ప్రేమలేఖ. ఆయనకు ఎన్ని సార్లు సాష్టాంగ ప్రమాణం చేసినా తక్కువే.

కేసీఆర్ అడుగుజాడలు అవి.
ఆయన చూపించే బంగారు భవిత అది.

సిసలైన తెలంగాణ ప్రేమికులకు కేసీఆర్‌లోని దార్శనికత, తెలంగాణ తనం అర్థం అవుతది, హత్తుకుంటది! తన బిడ్డ మల్ల ఎప్పుడు ఒస్తడో అని ఇప్పుడు తెలంగాణ తపిస్తున్నది. భూమి పుత్రుని ఏలుబడిలోని వసంతమాసం మళ్లా రావాలని గ్రీష్మతాడిత వనం లాంటి రాష్ట్రం ఎదురుచూస్తున్నది. మోసపోయిన జనం ఇప్పుడు జాగరూకులు అయితున్నరు. ఏడాది కాలపు అరణ్యవాసం తొలగిపోవాలని కోరుకుంటున్నరు. ఎవరి అడుగుజాడలు తమకు బంగరు తోవను చూపగలవో తెలుసుకుంటున్నరు. వారి ఆకాంక్షలను తీర్చడం ఇప్పుడు బీఆర్ఎస్ పని.

ఈ వ్యాస శీర్షిక ఆలోచించే పెట్టిన. ఎవరి అడుగుజాడలు భద్రమైన భవిష్యత్ ఇస్తయో; ఎవరి అడుగుజాడలు అధఃపాతాళానికి తోసివేస్తయో ఎరుకతో ఉండాలి. సొంత కూటమిలోని పార్టీలను ఓడించడం తమ విధానంగా పెట్టుకున్న, దాన్ని నిర్లజ్జగా ప్రకటిస్తున్న భావదారిద్ర్య పార్టీ ఈ దేశానికీ, రాష్ట్రానికీ ఏం చేయగలదు?

బంగ్లాదేశ్‌లో అధికార మార్పిడి జరిగిన సందర్భంలో ఆ దేశ విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహీద్ హుస్సేన్ ఒక గొప్ప మాట అన్నరు. విధాన నిర్ణయాలు ప్రభుత్వాల మార్పిడితో మరుగు కాకూడదని. యూపీఏ హయాంలో వచ్చిన ఎన్నో చట్టాలు తదనంతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్పులు లేకుండా అమలులో పెట్టినయి. ప్రస్తుత ముఖ్యమంత్రికి ఆ సోయి లేదు. కేసీఆర్ కూర్చిపెట్టిన వ్యవస్థలను కంటిన్యూ చేసి ఉంటే, ఈ సంవత్సర కాలంలో ఆయనకు కొన్ని మంచి మార్కులు పడి ఉండేవి. ఆరు గ్యారెంటీలలో కొన్నైనా అమలు చేయగలిగే సంపద సృష్టి జరిగి ఉండేది. అట్లా ఉంటే ఆయన రేవంత్‌రెడ్డి ఎందుకైతడు? పేర్ల మార్పు, వాస్తు మార్పు, మొత్తంగా ప్రజల ఏమార్పు తప్ప మరో ధ్యాస లేదు. సొంత నియోజకవర్గాన్ని శాంపిల్‌గా రాష్ట్రాన్ని భయంలో ముంచెత్తిన్రు. నిర్బంధాలు, అరెస్టులు అంటూ భయపెట్ట జూస్తున్నరు. అవన్నీ తెల్లారి పతాక శీర్షికలుగా మాత్రమే మిగిలిపోతున్నయి తప్ప ఎవరూ భయపడటం లేదు. దాంతో మరింత ఆక్రోశం, మరింత రెచ్చిపోవడం! 'ఆడలేక పాత గజ్జెలు' అన్నట్టు సహచర నాయకుల మీద, సివిల్ సర్వెంట్ల మీద తప్పులు మోపుతున్నరు రేవంత్. వేస్తున్న ప్రతి అడుగూ తనను ఊబిలోకి లాక్కుంటున్నదనే ఎరుక రాదు!

తెలంగాణపై మొక్కవోని ప్రేమతో పోరాడుతున్న బీఆర్ఎస్ శ్రేణులకు అభినందనలు. మొన్న పెద్దాయన చెప్పిన మాటలు మననం చేసుకుందాం. మిగతా పార్టీలకు తెలంగాణ అంటే రాజకీయం; మనకు తెలంగాణ అంటే టాస్క్! మిగతా పార్టీలకు వాటి పుట్టుక మాత్రమే చరిత్ర; మనకు తెలంగాణ జీవనయానమే చరిత్ర. మన ప్రస్థానం, మన బతుకు చిత్రం వేర్వేరు కాదు.

ఎంత లోతైన చూపు? ఎంత తడి? కాబట్టే 'గెలుపు కాదు, తెలంగాణ నిలుపు' అని స్ఫటిక స్పష్టమైన మార్గం చూపిన్రు. సారు అడుగుజాడలే మన వెలుగు తొవ్వ! పదకొండేండ్ల కింద నిన్నటి ఫిబ్రవరి 20వ తేదీన రాజ్యసభలో 'ది బిల్ ఈజ్ పాస్డ్' అన్న ఆ మాట తెలంగాణకు ప్రాణస్వరం. సమున్నతంగా నిలబడే తెలంగాణ అనే అవర్ 'విల్ షల్ బి పాస్డ్' లక్ష్యంతో పునరంకితమవుదాం.

'మంచి ఆశయాలుంటే..
మానవులందరూ/ మచ్చలేని వెలుగునే..
చేరుకోందురూ!' అన్నరు
డాక్టర్ సి.నారాయణ రెడ్డి. అది మన గురించే!

జై కేసీఆర్, జై తెలంగాణ!!

దేశంలో ఎక్కడైనా నక్సలైట్లకు, పోలీసు బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయంటే ముందుగా తెలుగు గుండె కలవరపెడుతుంది. పోలీసులు వేటాడే ప్రాంతాలు ఆంధ్ర-ఒడిశా బార్డర్, దండకారణ్యం, అబూజ్‌మడ్ పేరేదైనా ఆ అడవుల్లో తూటాలకు రాలిపోయే ప్రాణాల్లో తెలుగువారివే ఎక్కువ. ఇంకా విడమరిచి చెప్పాలంటే అవి తెలంగాణలోని కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాలకు చెందిన బిడ్డలవే. 1970ల్లో ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో మొదలైన నక్సలైట్ల ఉద్యమం ఉత్తర తెలంగాణకు పాకి రెండు, మూడు దశాబ్దాల పాటు తన ఉనికిని చాటుకున్నది.

నినాదం కడుపు నింపుతదా?

బద్రినర్సన్
9440128169

1978లో జగిత్యాల, సిరిసిల్ల కల్లోలిత ప్రాంతాల ప్రకటన, కేంద్ర బలగాల మోహరింపు వల్ల ఆత్మరక్షణలో పడిన నక్సలైట్లు నల్లమల అడవుల్లో తమ స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. 2004లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి వారిని చర్చలకు పిలిచినా, అవి మధ్యలోనే ఆగిపోయాయి. అదే అదనుగా ప్రభుత్వం నల్లమలలో వారి గుట్టును పసిగట్టగలిగింది. వై.ఎస్. కాలంలో ఎందరో నక్సలైట్లు చనిపోగా మిగిలినవారు సరిహద్దు రాష్ట్రాల్లోని అడవుల్లో తలదాచుకుంటున్నారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లోని గిరిజనులను తమ దళాల్లో చేర్చుకుంటూ వారి హక్కుల రక్షణ కోసం వీలైన పోరాటాన్ని నడుపుతున్నారు. తొలినాళ్లతో పోల్చితే అసలు నక్సలిజం మూలకు పడిందనే చెప్పాలి.

2014లో కేంద్రంలో ఎన్డీయే పాలన మొదలైన నాటినుంచి దేశంలో నక్సలైట్ అనే ప్రాణి ఊపిరి తీసుకోవద్దని బీజేపీ నిర్ణయించుకున్నది. ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాల వేట మొదలైంది. అయితే, ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల్లో ఉన్న అడవిపై నక్సలైట్లకు పూర్తి పట్టు ఉండటం వల్ల పోలీసుల శ్రమకు తగ్గ ఫలితం ఉండేది కాదు. గత ఏడాది నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ విషయాన్ని ఓ స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టారు. పోలీసు దళాల పెంపు, అధిక నిధుల కేటాయింపు, ఆధునిక ఆయుధాలు, సాంకేతిక వ్యవస్థ ఉపయోగం వల్ల అడవిలో దాక్కున్నవారికి ఊపిరి సలపలేని పరిస్థితి ఏర్పడింది. చిట్టడివిలో, చీకట్లో ఉన్నా డ్రోన్ల సాయంతో కనుగొని మావోయిస్టులను ఏరివేస్తున్నారు.

గత ఏడాది పోలీసు తూటాలకు 233 మంది మావోయిస్టులు బలయ్యారు. వారిలో ఏడుగురు కీలక నేతలున్నారు. ఈ మృతుల్లో పెద్దపల్లి, మంచిర్యాల, వరంగల్ ప్రాంతాలకు చెందినవారే ఎక్కువ. జనవరిలో గరియాబంద్ ఎన్‌కౌంటర్‌లో 14 మంది తీవ్రవాదులు చనిపోయారు. వారిలో ముగ్గురు ముఖ్యనేతలున్నారు.

ఈ నెల 9న ఇంద్రావతి నేషనల్ పార్క్ వద్ద జరిగిన కాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందారు. 2025లో 40 రోజుల్లో 86 మంది హతులయ్యారు. ఒక్కో ఎన్‌కౌంటర్‌లో పదుల సంఖ్యలో విప్లవకారులు చనిపోవడంతో భద్రతాదళాలు భారీ విజయాలను సాధిస్తున్నాయంటూ అమిత్ షా సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ధీమాగా మార్చి, 2026 నాటికీ దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చుతామని అమిత్ షా ప్రకటించారు. ప్రస్తుతం అడవిలో నేతల లక్ష్యంగా భద్రతాదళాల కదలిక సాగుతున్నది. అలా వారు టార్గెట్ చేసిన నేతల్లో తెలుగువారే అధికం. అందులో 23 మంది నాయకులు తెలంగాణకు చెందినవారే. కేంద్ర బలగాల జోరు చూస్తుంటే వీరిని చేరుకోవడం అసాధ్యం కాదనిపిస్తున్నది. ఏ క్షణం ఏ అగ్రనేత మరణవార్త వినవస్తుందో అనేలా పరిస్థితులున్నాయి. దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చేస్తానని అమిత్ షా అనగానే విప్లవవాదులు ఆ మాటను ఎద్దేవా చేస్తూ ప్రకటనలు ఇచ్చారు. కమ్యూనిజాన్ని నామ రూపాల్లేకుండా చేస్తామని చరిత్రలో ఎందరో అన్నారు. అన్నవారే పోయారు తప్ప కమ్యూనిజం ఇంకా బతికే ఉన్నదని ఉదాహరణలు ఇచ్చారు. భావోద్వేగంతో కొందరు 'ఒక వీరుడు మరణిస్తే వేనవేలు ప్రభవింతురు' అన్న కవితాపంక్తులను ఉటంకించారు. వారన్నట్టు కమ్యూనిజం ఓ సిద్ధాంతం. దాన్ని ఆచరించేవారు పెరగవచ్చు, తగ్గవచ్చు కానీ సిద్ధాంతానికి చావు లేదు.

అయితే, ఇప్పుడు మరణిస్తున్నవారికి జోహార్లు అంటే సరిపోతుందా? వారి శవాల ముందు 'అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం' అని పిడికిలి బిగించి నినదిస్తే ఉద్యమం బతుకుతుందా? పోలీసులకు చిక్కకుండా నానా కష్టాలు పడుతూ తప్పించుకు తిరుగుతున్నవారు అలా చావడం అవసరమా? ఆ చావు అమరత్వమే అయినా అది నిష్ఫల త్యాగమే కదా! వారికి మనలా బతికే అవకాశమే లేదా! వాళ్లు దేశంపై దాడి చేస్తున్న విదేశీ శక్తులు కారు, ఈ దేశ పౌరులు. వాళ్లు దోపిడీ దొంగలు కారు, దేశ సంపదను అందరూ సమానంగా అనుభవించాలని కోరుకుంటున్న ఉద్యమకారులు. ఒక ఆశయానికి కట్టుబడి యుద్ధం చేస్తున్నవారు ఓటమి అంచున ఉన్నారు. మీరు బతకాలనుకుంటున్నారా, లేక ఇలాగే ఎదురు కాల్పుల్లో చనిపోవాలనుకుంటున్నారా.. అనే ఒక్క అవకాశాన్ని వారికివ్వడం కుదరదా!

దేశాన్ని మావోయిస్టు రహితంగా మార్చేస్తానని అమిత్ షా అనగానే విప్లవవాదులు ఆ మాటను ఎద్దేవా చేస్తూ ప్రకటనలు ఇచ్చారు. కమ్యూనిజాన్ని నామ రూపాల్లేకుండా చేస్తామని చరిత్రలో ఎందరో అన్నారు. అన్నవారే పోయారు తప్ప కమ్యూనిజం ఇంకా బతికే ఉన్నదని ఉదాహరణలు ఇచ్చారు.

అబూజ్‌మడ్ ఏరియాలో కొన్ని బేస్ క్యాంపులు ఏర్పాటుచేసి 'లొంగిపోండి.. లేదంటే చంపేస్తాం!' అని స్పీకర్ల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే, ఆ హామీని ఎంతవరకు నిజాయితీగా అమలుచేస్తున్నారో తెలియదు. ఇప్పుడు అమిత్ షా 'ఎన్‌కౌంటర్ స్కోరెంత' అన్నట్టుగా ఉన్నారు. బలగాలు కూడా అదే జోష్‌లో ఉన్నాయి.

ప్రభుత్వాలు ఎందరిని చంపినా ఎవరో ఒకరు మళ్లీ విప్లవం అంటూ పుట్టుకొస్తూనే ఉంటారు. అలాగని ఇప్పుడు అడవిలో ప్రాణాలు కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నవారిని వదిలేయలేం. వారిలో లొంగిపోయేందుకు ఇష్టపడేవారికి ఓ అవకాశం ఇవ్వాలి. చస్తే అమరత్వం కన్నా బతికే జీవితమే గొప్పది. అడవిలో మిగిలిన మావోయిస్టులకు, వేట సాగిస్తున్న ప్రభుత్వానికి మధ్య ఓ మధ్యవర్తిత్వం కావాలి. ఇలాంటి పనులు పౌరహక్కుల నేతలు, ప్రజాస్వామ్యవాదులు గతంలో చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ చొరవ తీసుకోవాలి.

కొంతకాలం రెండువైపులా కాల్పులు ఆపేసి అన్నల్లో ఎంతమంది జనజీవన స్రవంతిని కోరుకుంటున్నారు, వారికి ఎలాంటి క్షమాభిక్ష పెడతారని సంప్రదింపులు ప్రభుత్వం హామీపై జరగాలి. మావోయిస్టుల్లో ఎక్కువమంది తెలంగాణకు చెందినవారే ఉన్నందున ఇక్కడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ బాధ్యత తీసుకోవాలి. పిట్టల్లా రాలిపోతున్న వారి పేర్లు, ఊర్లు, వివరాలు పత్రికల్లో వస్తున్నాయి. వారి ఊర్లలో అంతిమయాత్రల వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం అదేదీ తమకు సంబంధం లేనట్టు పూర్తిగా పట్టనట్టుంది.

గత ఏడాది అక్టోబర్ 7న ఢిల్లీలో హోం శాఖ ఆధ్వర్యంలో నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక సమావేశం జరిగింది. అందులో తెలంగాణ, ఏపీ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. నక్సల్స్ నిర్మూలనలో ఆచరించవలసిన వ్యూహాలు, అందులో రాష్ట్రాల పాత్ర, సహకారం గురించి ఆ సమావేశంలో చర్చించినట్టు తెలుస్తున్నది. అప్పటికి కొన్ని రోజుల ముందు దంతెవాడలో ముప్పై మంది మావోయిస్టులు చనిపోయారు. అడవిలో ఉన్న తెలంగాణ వాసులు పోలీసు తూటాలకు బలికాకుండా కాపాడేందుకు ప్రభుత్వం కృషిచేయాలి. మేధావుల సూచనలు తీసుకొని వారిని రక్షించే పని ప్రభుత్వాలకే సాధ్యమవుతుంది. ■

"కొలువులెక్కడ?"

దేశంలోని మిగతా రాష్ట్రాలు భౌగోళికంగా ఏర్పడితే, తెలంగాణ మాత్రం భావోద్వేగాల పునాదుల మీద ఏర్పడింది. ఇక్కడ కదిలిస్తే అమరవీరుల తల్లుల కన్నీళ్లు కన్పిస్తాయి. నీళ్లు, నిధుల కోసం నాయకులు కొట్లాడితే కొలువులే కొలమానంగా తొలి నుంచి తుది వరకు ఉద్యమంలో కొట్లాడింది విద్యార్థులే. తెలంగాణ వస్తే కోరుకున్న కొలువు వస్తదని, గొప్పగా బతుకుతామని తమ ప్రాణాలను పణంగా పెట్టారు. ఆ త్యాగాల పునాదులపైనే తెలంగాణ పురుడుపోసుకున్నది.

తమది ప్రజా ప్రభుత్వమని, నిరుద్యోగుల బాధలు, సమస్యలు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలని, జాబ్ క్యాలెండర్ అని ప్రకటించి ఆశలు రేకెత్తించారు. ఇంకెన్నో హామీలివ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక కొలువుల పండుగే అనుకున్నాం. కానీ, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా మోసం చేసింది. ఏడాది తిరిగేలోగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పటికి ఇచ్చింది 12 వేల ఉద్యోగాలు మాత్రమే. అంటే 5 శాతం మాత్రమే భర్తీ చేసి 95 శాతం ఉద్యోగాల భర్తీని మర్చిపోయింది. ఇచ్చింది 12 వేల ఉద్యోగాలే అయినా 55 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటు.

ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వంలో చిత్తశుద్ధి కనిపించడం లేదు. కనీసం ఆ వైపుగా కూడా అడుగులు పడటం లేదు. దీంతో నిరుద్యోగుల్లో రోజురోజుకు నమ్మకం సన్నగిల్లుతున్నది. పోటాపోటీగా జాబ్ క్యాలెండర్ కృతజ్ఞత సభలను పెట్టారు కానీ, దాని అమలు విషయాన్ని మర్చిపోయారు. నిరుద్యోగులంటే నిరక్షరాస్యులు కాదు.. వారిని ఎప్పటికీ మోసం చేయలేరు. రికార్డుస్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ అని, అప్పులని, వర్గీకరణ అంటూ కావాలనే కాలయాపన చేస్తున్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో ఏపీలో అడ్డురాని ఎస్సీ వర్గీకరణ తెలంగాణలో ఎందుకు వస్తున్నది.

ప్రభుత్వ అప్పులకు, ఉద్యోగాలకు ముడిపెట్టడం ఎంతమాత్రమూ సబబు కాదు. కాంగ్రెస్ వస్తే కొలువులు వస్తాయని నిరుద్యోగులు ఎంతగానో కష్టపడ్డారు. కాబట్టి మ్యానిఫెస్టోలో పెట్టినట్టుగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి. రిటైర్మెంట్ వయసును ప్రభుత్వం పెంచబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇదే నిజమైతే నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లినట్టు అవుతుంది. ఏండ్లకేండ్లు కుటుంబాలకు దూరంగా, అర్ధాకలితో, రూ. 5 భోజనం చేస్తూ, అగ్గిపెట్టెలాంటి గదుల్లో ఉంటూ, అప్పులు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఇది కోలుకోలేని దెబ్బ అవుతుంది. ఆర్థిక ఇబ్బందుల నెపంతో తాత్కాలిక ఉపశమనం కోసం నిరుద్యోగుల కలలను సమాధి చేయడం తగదు. ఉద్యోగాల భర్తీని, జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే త్వరలో జరిగే కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఊరూరా తిరిగి ప్రచారం చేస్తాం. కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తాం. రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా, హాయిగా, సంతోషంగా కుటుంబ సభ్యులతో బతకాల్సిన ఉద్యోగులను రిటైర్మెంట్ వయసు పెంచి బలవంతంగా వారిని ఉద్యోగంలో కొనసాగించాల్సిన అవసరం ఏమొచ్చింది. రిటైర్మెంట్ వయసు పెంచాలని వారేమీ ధర్నాలు, నిరసనలు చేయలేదు కదా. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచితే దాదాపు 50 వేల ఉద్యోగాలను నిరుద్యోగులు కోల్పోతారు.

స్థానికేతరులు అయిన ఆంధ్రావారికి, కొన్ని వర్గాల ప్రజల మెప్పు కోసం ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా జీవో 29ను తీసుకొచ్చింది. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా మెరిట్‌కే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుంది. దీపేందర్ యాదవ్, కిషోర్ చౌదరి, సౌరవ్ యాదవ్, ఇందిరా సహానీ కేసుల్లో అన్ని దశల్లోనూ (ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ) రిజర్వేషన్లు పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కోర్టు తీర్పులకు విరుద్ధంగా ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తున్నది. ఇక, జీవో 46 ఇంకో లొల్లి. అధికారంలోకి వచ్చాక జీవో 46ని రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చింది. ఇంతవరకు ఆ పని చేయకపోగా, దీనిపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తున్న బాధితులకు సాయం చేయడానికి కూడా ముందుకు రావడం లేదు. ఇది ప్రభుత్వ ద్వంద్వనీతికి నిదర్శనం.

ఎప్పటికప్పుడు ఖాళీ అయ్యే ప్రతి ఉద్యోగమూ ముందు రోజే భర్తీ అయ్యేలా ప్రభుత్వం కృషి చేయాలి. ప్రభుత్వ ఉద్యోగాలు పరిమితంగా ఉంటాయి కాబట్టి ప్రైవేటు ఉద్యోగాలపైనా ప్రభుత్వం దృష్టిసారించాలి. తెలంగాణ బిడ్డలకు ఉద్యోగాలు ఇచ్చే కంపెనీలకు రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలి. తెలంగాణ ఏర్పడిందే నియామకాల కోసం కాబట్టి ప్రైవేటు ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు దక్కేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలి.

పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యంపై ప్రభుత్వమే శిక్షణ ఇవ్వాలి. ప్రతి మండలంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పరిశ్రమలు కోరుకుంటున్నట్టు, పారిశ్రామిక అవసరాలు తీర్చేలా విద్యా వ్యవస్థని సమూలంగా మార్చాలి. వ్యాపారాలు చేయాలనుకునే తెలంగాణ బిడ్డలకు ఉదారంగా రుణాలు ఇవ్వాలి. అప్పుడే కొలువుల తెలంగాణ అవతరిస్తుంది.

- శ్రవణ్ కుమార్, నిరుద్యోగి